క్లుప్తంగా

నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత

చండూరు : నాణ్యమైన విద్య, వైద్యం అందరికీ అందించడం ప్రభుత్వ బాధ్యత అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ అన్నారు. ఆదివారం చండూరులో నిర్వహించిన డీవైఎఫ్ఐ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కట్టెల లింగస్వామి, తరుణ్, అనిల్, ధనంజయ్, నరేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

బెల్లి లలితకు నివాళి



లలిత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మునుగోడు: సామాజిక ఉద్యమ నాయకురాలు బెల్లి లలిత వర్ధంతిని ఆదివారం మునుగోడులో ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డోల్‌దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మాలిగ యాదయ్య, యాదవ సంఘం నాయకులు తిరిపారి ఆంజనేయులు, రామకృష్ణ, వెంకన్న, పునత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



భావనకు స్వీట్లు తినిపిస్తున్న జనతా ఆర్గనైజేషన్ ప్రతినిధులు

చిట్యాల: మండలంలోని సుంకెనెపల్లి గ్రామానికి చెందిన యాకారి యాదయ్య కుమార్తె భావన ఐఐఎంలో (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) ఎంబీఏలో సీటు సాధించడంపై జనతా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఆమె బీబీనగర్‌లో సాంఘిక సంక్షేమ సైనిక శిక్షణ మహిళా కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. అనంతరం క్యాట్ ఎగ్జామ్–2023లో 78.8 శాతం స్కోర్ చేసి ఉత్తరాఖండ్‌లోని ఖాజీపూర్, బోధగయ, జమ్ములోని మూడు ఐఐఎంలలో సీటు సాధించింది. అంతేకాకుండా ఏఎఫ్‌సీఏటీ(ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్)–2024 సైతం ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూకి అర్హత సాధించింది. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ అన్నబోయిన సూర్యతేజ, జనతా ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు నమ్ముల లోకేష్, సభ్యులు నమ్ముల నవీన్, మలిగే సందీప్, అంతటి సుమంత్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

మాడుగులపల్లి : మండలంలోని పాములపహాడ్ గ్రామానికి చెందిన ముద్దం శ్రీను ఆలయానికి పేయింటింగ్ వేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి ఇటీవల మృతి చెందాడు. ఆదివారం అతడి దశదిన కర్మ సందర్భంగా పదో తరగతి స్నేహితులంతా హాజరై కుటుంబబ సభ్యులను పరామర్శించి రూ. 23 వేలు ఆర్థిక సాయం అందజేశారు. శ్రీను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈదయ్య, నాగయ్య, కిరణ్, వీరేష్, సైదులు, సమత, శ్రవణ్, స్వామి, జగదీష్, శ్రావణి, అనిత, తులసి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



చిట్యాల : పోలింగ్ సామగ్రితో వస్తున్న ఎన్నికల సిబ్బంది



కేతేపల్లి : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది, పోలీసులు

చిట్యాల: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు చిట్యాలలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సిబ్బంది ఆదివారం పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కాగా మండలవ్యాప్తంగా 3025 మంది పట్టభద్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరిలో 1901 మంది పురుషులు, 1124 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. చిట్యాలలోని జెడ్పీహెచ్ఎస్‌లో మూడు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పట్టభద్రులకు పోల్ చిట్టీలను బీఎల్ఓలు అందజేశారు.

కేతేపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు కేతేపల్లి మండలంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని 16 గ్రామాల్లో 1456 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 969, మహిళలు 487 మంది ఉన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అధికారులు రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల సామగ్రితో పోలీసు బందోబస్తు నడుమ సిబ్బంది ఆదివారం సాయంత్రం కేతేపల్లికి చేరుకున్నారు.

మునుగోడు: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 2432 ఓటర్లు ఉండగా అందులో 1576 మంది పురుషులు, 856 మంది స్త్రీలు ఉన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తు నడుమ మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆదివారం పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. తహసీల్దార్ ఎం.నరేందర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కట్టంగూర్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దారు గుగులోతు ప్రసాద్ తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం కట్టంగూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. మండల వ్యాప్తంగా 1874 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు.

మర్రిగూడ : ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన సామగ్రితో సిబ్బంది ఆదివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చేరుకున్నారు. మండలంలో మొత్తం 1384 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు తెలిపారు.

నకిరేకల్ : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు నకిరేకల్ మండలంలో అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. నకిరేకల్ మండలంలో మొత్తం 3521 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. నకిరేకల్ జెడ్పీ హైస్కూల్‌లో మొత్తం నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని పట్టభద్రులంతా నకిరేకల్ జెడ్పీ హైస్కూల్‌లోనే తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

చండూరు: పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి చండూరు డివిజన్ వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల సామగ్రితో అధికారులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. డివిజన్‌వాప్తంగా చండూరు–3, గట్టుప్పల్–1, మునుగోడు–2, మర్రిగూడ–2, నాంపల్లి –1 మొత్తంగా 9 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆర్డీఓ సుబ్రహ్మణ్యం ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



మర్రిగూడ : ఎన్నికల సామగ్రితో సిబ్బంది



కట్టంగూర్‌లో..



మునుగోడు : పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు, పోలీసు సిబ్బంది

బీభత్సం సృష్టించిన గాలివాన



నల్లగొండ పట్టణంలోని నటరాజ్ టాకీస్ రోడ్డులో కూలిన విద్యుత్ స్తంభం



నల్లగొండ పట్టణంలోని కలెక్టరేట్ ప్రహరీపై కూలిన భారీ వృక్షం



నల్లగొండ పట్టణంలోని ఓ ఇంటి ఆవరణలో కూలిన చెట్టు



కట్టంగూర్‌లో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులు చిరుజల్లులతో కూడిన గాలివానకు పలు ప్రాంతాల్లో రోడ్లపై చెట్లు కూలి అడ్డంగా పడిపోయాయి. గాలులకు ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలు సైతం కిందపడిపోయాయి. ఇళ్ల రేకులు గాలులకు లేచి రోడ్లపై పడ్డాయి. శాంతినగర్, రహమత్‌నగర్, బీటీఎస్, గొల్లగూడ, రామగిరి, బొట్టుగూడ, బోయవాడ, ఆర్టీసీ కాలనీ, పానగల్ ఫ్లైఓవర్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో చెట్లుకూలి రోడ్లపై పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెడ్‌క్రాస్ భవనం ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభంపై వేప కొమ్మ విరిగిపడడంతో విద్యుత్ స్తంభం కూలిపోయి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అనేక ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తోపుడు బండ్లపై ఉన్న వస్తువులు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు గాలులకు కొట్టుకుపోయాయి.

ఈదురు గాలులకు కూలిన ప్రహరీ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురు గాలుల ధాటికి నల్లగొండ పట్టణంలోని ముషంపల్లి రోడ్డు ధాత్రినగర్ వెంచర్‌లోని పార్కు ప్రహరీ కూలిపోయింది.

రేకులు ధ్వంసం

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలో ఆదివారం ఈదురు గాలులు, భారీ వర్షం పడడంతో పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. చందనపల్లిలో ఈదురు గాలులకు ప్రహరీలు, ఇంటి రేకులు ధ్వంసమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నల్లగొండ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న స్కూటర్ పార్కింగ్ ఏరియాలో ఉన్న రేకుల షెడ్ ధ్వంసమైంది. పార్కింగ్ ఏరియాలో ఉన్న వాహనాలు దెబ్బతిన్నాయి. దీంతో రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని పార్కింగ్ నిర్వాహకులు తెలిపారు.

కట్టంగూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు ఈదురు గాలులు వీయడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కోతకు వచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. గాలులు వీయడంతో అధికారులు ముందస్తుగా విద్యుత్ సరఫరా నిలపివేశారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగి తీగలు తెగిపడ్డాయి. రాత్రి పొద్దుపోయేంత వరకు కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవకాశం లేకుండా పోయింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో భారీ చెట్లు విరిగి రోడ్లు, నివాస గృహాలపై పడ్డాయి.

చండూరు, గట్టుప్పల్ మండలాల్లో..

చండూరు : గట్టుప్పల్, చండూరు మండలాల పరిధిలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. చండూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో పున్న రామలింగం ఇంటిపై చెట్టు కూలడంతో ఇంట్లో ఉన్న ఫ్రిజ్, ఇతర సామగ్రి ధ్వంసమయ్యాయి. నెర్మట గ్రామంలో నారపాక రాములు, నారపాక జంగులు, ఈరగంట్ల నర్సింహలకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. గట్టుప్పల్ మండలం అంతంపేటకు చెందిన భూతరాజు సత్తయ్య కొట్టం రేకులు ఎగిరిపోయాయి. ఆయా గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



చండూరు : నెర్మట గ్రామంలో..



నల్లగొండ : పెద్దబండలో..

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం 6వ వార్షికోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు బెతోష సత్యనారాయణశాస్త్రి, ఉత్తరపల్లి అనంతాచార్యులు అర్చక బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, కల్యాణ మహోత్సవం నిర్వహించారు. వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నకిరేకల్‌కు చెందిన గడగోజు కృష్ణమాచారి జయలక్ష్మి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ వ్యవస్థాపకులు పెందోట సోమయ్య, అద్దంకి కృష్ణమాచారి, ఆలయ చైర్మన్ చొల్లేటి బ్రహ్మాచారి, వైస్ చైర్మన్ గుంటోజు రమేష్,, ప్రధాన కార్యదర్శి చొల్లేటి శ్రీనివాసచారి, గడగోజు సత్యనారాయణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే కరాటే నేర్చుకోవాలి



బండను పగులగొట్టి కరాటే ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే కరాటే నేర్చుకోవాలని, కరాటే నేర్చుకోవడం ద్వారా తమను తాము రక్షించుకోవచ్చని సందీప్ హైస్కూల్ చైర్మన్ జి.సత్యనారాయణరెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల సందీప్ హైస్కూల్‌లో కరాటే సమ్మర్ క్యాంపు శిక్షణలో భాగంగా షావోలిన్ షోటాఖాన్ స్పోర్ట్సు కరాటే ఇండియా వారు ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బండను పగులకొట్టే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాంపల్లి కనకారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన చేస్తున్న నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణస్వామి

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని అక్కినేనిపల్లి శ్రీదేవి–లక్ష్మణరావు నివాసంలో భాగవత సప్తాహం వేడుకల్లో భాగంగా ఆదివారం లక్ష పుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రవచన కర్త నల్లాని చక్రవర్తుల రామకృష్ణ స్వామి ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చనలో 150 మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాఘవాచార్యులు, గోపాలకృష్ణమాచార్యులు, రామరంగాచార్యులు, సీతా రామానుజాచార్యులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దుతాం

మర్రిగూడ : మౌలిక వసతులు లేని గ్రామాలను దత్తత తీసుకుని ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని యూత్ ఫర్ సేవా సంస్థ ప్రతినిధి డోలా పుండరీకాంక్ష అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొట్టాల, సరంపేట గ్రామాల్లో సంస్థ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని పలు సాఫ్ట్‌వేర్ సంస్థల సహకారంతో గ్రామాలను దత్తత తీసుకుని కనీస అవసరాలైన విద్య, వైద్యం, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. గ్రామ భారతి కమిటీ సభ్యులు పాలవి మోహనయ్య, పల్లెట్ల అరుణ్‌సాగర్, జల్లాకుల సైదులు, నర్సింహ, కిరణ్, యాదగిరి పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

నల్లగొండ టౌన్ : నల్లగొండలో ఆదివారం సాయంత్రం వీచిన భారీ గాలులకు గాయపడిన వారిని, నిరాశ్రయులైన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం పట్టణ పట్టణ కార్యదర్శి ఎండీ సలీం డిమాండ్ చేశారు. ఆదివారం పెద్ద బండలో దోరేపల్లి సైదులు, బోళ్ల బ్రహ్మయ్య ఇల్లు కూలి నష్టపోయారన్నారు. గొల్లగూడ, పెద్ద బండ, లెప్రసి కాలనీల్లో తీవ్ర గాలి దుమారం వల్ల ఇళ్లు ధ్వంసమయ్యాయని అన్నారు. రెవెన్యూ సిబ్బంది నష్టపోయిన కుటుంబాలను పరిశీలించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య,తుమ్మల పద్మ, గాదె నరసింహ, మన్నె శంకర్, గడగోజు శ్రీనివాస చారి, తెలకలపల్లి శ్రీను, కొత్త అశోక్, ఆమంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

చండూరు : కాంగ్రెస్ పార్టీ నుంచి చండూరు పట్టణ మాజీ అధ్యక్షుడు వడ్డేపల్లి భాస్కర్‌ను జిల్లా కమిటీ ఆదేశానుసారం సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి భాస్కర్ తీరుతో పార్టీకి నష్టం జరుగుతోందని ఇకనుంచి ఆయనకు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

అసంపూర్తి డ్రెయినేజీతో అవస్థలు !



అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం(ఫైల్)



ఓ దుకాణం ఎదుట నడవడానికి ఏర్పాటు చేసుకున్న తడకలు

- ఏడాదిన్నరగా సాగుతున్న పనులు
- ఇబ్బందులు పడుతున్న నకిరేకల్ ప్రజలు

నకిరేకల్ : నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్ మున్సిపాలిటీలో ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆరు మండలాలకు ముఖ్య కూడలిగా ఉన్న నకిరేకల్ పట్టణంలో ప్రజల రద్దీ, రాకపోకలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పట్టణ జనాభా 40 వేల పైచిలుకు ఉంది. చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు చదువులు, వ్యాపారాల అవసరాల నిమిత్తం వచ్చి ఇక్కడే స్థిరపడడంతో పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి.

రింగ్ చౌరస్తా తొలగింపు..

గత ప్రభుత్వ హయాంలో నకిరేకల్ పట్టణంలో నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ కోసం రూ.26 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో ప్రధాన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ పనులు చేపట్టారు. 2022 నవంబర్ 25న పనులు ప్రారంభించారు. అయితే ఏడాదిన్నర దాటినా ఇంకా పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు, వాహనదారులు, రోడ్డు వెంట ఉన్న దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. పద్మనగర్ జంక్షన్ నుంచి ఇనుపాముల జంక్షన్ వరకు రెండు వైపులా డ్రెయినేజీ, మధ్యలో డివైడర్లు, స్ట్రీట్ లైట్ స్తంభాల నిర్మాణం 70 శాతం పూర్తి చేశారు. మెయిన్ సెంటర్‌లో రింగ్ చౌరస్తా పెద్దదిగా ఉండి రాకపోకల విషయంలో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అఖిల పక్షాలు, వ్యాపారులు, పట్టణ ప్రజలతో చర్చావేదిక ఏర్పాటు చేసి వారి అభ్యర్థ మేరకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశానుసారం నిర్మాణంలో ఉన్న దానిని పూర్తిగా తొలగించారు. మరో డిజైన్ (పడవ ఆకారం) నిర్మాణం కోసం కొత్త ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

తొమ్మిది నెలలుగా..

మరోవైపు శ్రీకనకదుర్గ ఆలయం సమీపంలో రోడ్డు వెంట డ్రెయినేజీ నిర్మాణం కోసం దుకాణాల ఎదుట జేసీబీతో తవ్వారు కానీ పనులు చేపట్టలేదు. తొమ్మిది నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడం, ఆ తరువాత ఎంపీ ఎన్నికలు రావడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. డ్రెయినేజీ పనులు చేపట్టకపోవడంతో దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల్లోకి వెళ్లేందుకు పెద్ద పెద్ద తడకలు ఏర్పాటు చేసుకుని దాని పైనుంచి వెళుతున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగించాలి



మెయిన్ రోడ్డు వెంట ఉన్న మాషాపు ఎదుట తొమ్మిది నెలల క్రితం పెద్ద డ్రెయినేజీ తవ్వారు. డ్రెయినేజీ ఓపెన్ చేసి ఉండడంతో షాపులోకి ఎవ్వరూ రావడం లేదు. మా వ్యాపారం కూడా తగ్గింది. మరోవైపు పాములు, దుర్వాసనతో షాపులో కూర్చోలేకపోతున్నాం. డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తిచేసి మా ఇబ్బందులు తొలగించాలి.

– కనుకుంట్ల సంజీవరెడ్డి, వ్యాపారి, నకిరేకల్

కొత్త తరహాలో చేపడుతున్నాం



పట్టణ ప్రజల కోరిక మేరకు రోడ్డు విస్తరణలో మార్పులు చేస్తున్నాం. వాహనదారులు, ప్రజలు రాకపోకలు విషయంలో ఇబ్బందులు కలగకుండా ప్రధాన చౌరస్తాను కొత్త తరహాలో చేపడుతున్నాం. ప్రణాళికలో లోపాలు ఉన్నందున పనుల్లో స్వల్ప మార్పులు చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచనలు చేశాం. పద్మనగర్ జంక్షన్ వద్ద రౌండ్ సర్కిల్ ఏర్పాటు, పన్నాలగూడెం వద్ద ఎత్తుగా ఉన్న రోడ్డును తగ్గించాలని, పన్నాలగూడెం వద్ద చిన్నపాటి రౌండ్ సర్కిల్ నిర్మించాలని సూచనలు చేశాం.

– వేముల వీరేశం, ఎమ్మెల్యే, నకిరేకల్

త్వరలో పనులు చేపడతాం



ఎన్నికల కోడ్ కారణంగా రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వారం రోజుల నుంచి రోడ్డు వెంట పార్కింగ్ టైల్స్ వేసే పనులు ప్రారంభించాం. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చిడి చేయకపోవడంతో మిగతా పనులు కూడా కొంత అలస్యం అవుతున్నాయి. త్వరలోనే అన్ని పనులు చేపడతాం. మెయిన్ సెంటర్‌లో చౌరస్తా నిర్మాణం కోసం డిజైన్ ఫైనల్ కాలేదు.

– గౌతం, ఏఈ, నకిరేకల్ మున్సిపాలిటీ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిట్యాల : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



నకిరేకల్ : సమ్మేళనంలో పాల్గొన్న కాకతీయ కళాశాల విద్యార్థులు



శాలిగౌరారం : గురుజాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

చిట్యాల: మున్సిపల్ కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1997–98 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు గురువారెడ్డి, భిక్షం, నర్సింహాచారి, యాదయ్య, మల్లికార్జున్‌లను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వరకాంతం కిరణ్‌రెడ్డి, వీర్ల వెంకటేశ్వర్లు, దేవిరెడ్డి నరేందర్‌రెడ్డి, గందూరి శ్రీనివాస్, సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, లలిత, ప్రవీణ, అపర్ణ, వనజ, సుజాత, సునిత, ధనలక్ష్మీ, మంజుల పాల్గొన్నారు.

కాకతీయ జూనియర్ కళాశాలలో..

నకిరేకల్ : పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాల ఇంటర్ 1997–99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం, సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్నేహితులందరూ ఒక దగ్గర కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాడు తమకు విద్యను బోధించిన అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గూడురు సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు రఘుపతిరెడ్డి, జాన య్య, భరణికుమార్, శ్రీనివాస్, రాములు, కృష్ణ, పద్మచారి, శ్రీనివాసచారి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని గురుజాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు సాంబయ్య, రాంరెడ్డి, రామ్మూర్తి, అశోక్, సురేందర్‌రెడ్డిలను పూర్వవిద్యార్థులు పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కందుకూరి కిశోర్, ఇమ్మడి రాంబాబు, పుట్ట భద్రయ్య, అంజయ్య, నక్క మల్లేష్, మారోజు నవీన్, కుర్రె నరేశ్, తడకమల్ల కళ్యాణి, నిర్మల, ఉమ తదితరులు పాల్గొన్నారు.